వైర్లు, టైర్లు, వ్యర్థాలు తగలబెట్టేస్తున్నారు


జ్ఞానాపురం ఎర్రిగెడ్డలో తగలబెడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు

- వ్యాపారులు, ఆకతాయిల చర్యలతో కాలుష్యం
- కాలుష్య కోరల్లో జ్ఞానాపురం - కంచర పాలెం ప్రాంతాలు
- వైర్లు, టైర్లు, ఆయిల్ ఫిల్టర్లు తగలబెట్టడంతో దుర్వాసన, పొగ
- శ్వాసకోశ వ్యాధులతో స్థానికులకు ఇబ్బందులు
- కాలుష్య నియంత్రణపై స్పందించని అధికారులు

కంచరపాలెం: కంచర పాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన, జ్ఞానాపురం ఎర్రిగెడ్డ రహదార్లు కాలుష్యంతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. కంచరపాలెం పరిధి భారతీయ ఆహార గిడ్డంగి సంస్థ రహదారి నుంచి రామ్మూర్తి పంతులుపేట రైల్వేగేటుకు వెళ్లే రహదారిలో స్క్రాప్ దుకాణాలు, వాహనాల మరమ్మతుల దుకాణాలతో కాలుష్యం పెరిగిపోయింది. పలు ప్రాంతాల నుంచి తెచ్చిన వ్యర్థ పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో దహనం చేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శని, ఆదివారాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. వేసవి ప్రారంభమైనా శీతాకాలంలో పొగ మంచులా వంతెన మార్గాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. ఇష్టారాజ్యంగా తగలబెడుతున్న వ్యర్థాల నుంచి దుర్వాసన రావడంతో వాసన భరించలేక శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. దట్టమైన పొగ వెలువడడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలు సాగించే సమయంలో కళ్ల మంటలు చెలరేగడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.


జ్ఞానాపురం నుంచి కంచరపాలెం వెళ్లే వంతెన పక్కన తగలబెట్టిన వ్యర్థాలు

స్పందించని జీవీఎంసీ అధికారులు

వంతెన కింద రహదారిలో చీకటి పడితే స్థానిక స్క్రాప్ వ్యాపారులు వ్యర్థాలు తగలెట్టేస్తున్నారు. ఆ మార్గంలో పొగలో ప్రయాణం చేయాలంటేనే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కూత వేటు దూరంలో జోనల్ కార్యాలయం ఉండడంతోపాటు అటుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కాలుష్యానికి తోడు పొగ కమ్మేయడంతో వంతెన రహదారిలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్ – 5 కమిషనర్, పబ్లిక్‌హెల్త్ అధికారులు స్పందించాలని పాదచారులు, వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డులా మార్చేసి...

నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురం వెళ్లే లారీ యార్డు, ఎర్రిగెడ్డ సమీపంలో హరితవనం ప్రాంతంలో నిత్యం ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన చెత్త కుప్పలుగా పోగు చేస్తున్నారు. దీంతో ఇక్కడి పరిసరాలు డంపింగ్‌యార్డ్‌గా మారిపోయాయి. పైడిమాంబ ఆలయం రహదారిలో ఇదే అదునుగా లారీల మరమ్మతులు చేసే సిబ్బంది ఇంజన్లకు సంబంధించిన వ్యర్థాలు, ఆయిల్ ఫిల్టర్లకు మంట పెడుతున్నారు. చిల్లర దొంగతనాలు చేసిన ఆకతాయిలు విద్యుత్, కేబుల్ వైర్లు ఇక్కడే కాల్చుతున్నారు. దీంతో కార్బన్ మోనాక్సైడ్, ఇతర ప్రమాదకర వాయువులు వెలువడుతున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యర్థ పదార్థాలను కాల్చుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాకపోకలకు ఇబ్బందులు

కాలుష్యపు పొగ కమ్మే సమయంలో వంతెనపై ప్రయాణం చేస్తే ప్రమాదాల బారిన పడుతున్నారు. కళ్ల మంటలతోపాటు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వాహనాలు నడిపే పరిస్థితి నెలకొంటుంది. కాలుష్యం, దుర్వాసన వల్లే ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– పితాని నరేంద్ర, వాహనదారుడు, కంచరపాలెం

ప్రమాదాలకు గురవుతున్నాం

కాలుష్యపు పొగ కమ్మే సమయంలో వంతెనపై ప్రయాణం చేస్తే ప్రమాదాల బారిన పడుతున్నారు. కళ్ల మంటలతోపాటు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వాహనాలు నడిపే పరిస్థితి నెలకొంటుంది. కాలుష్యం, దుర్వాసన వల్లే ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– పితాని నరేంద్ర, వాహనదారుడు, కంచరపాలెం


కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెనపై కమ్ముకున్న పొగ

చర్యలు తీసుకుంటాం

వ్యర్థాలకు నిప్పు పెట్టి కాలుష్యానికి కారణమవుతున్న వారిపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యను గుర్తించేలా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులను ఆదేశిస్తాం. చెత్త, వ్యర్థాలు తగలబెట్టే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏఎంహెచ్‌వో, జోన్ – 5

వైఎస్సార్ సీపీ బలోపేతానికి పెద్ద పీట


చెన్నా జానకీరామ్


ద్రోణంరాజు శ్రీవత్సవ్


మక్సూద్ అహ్మద్


అభిరెడ్డి ఆదివిష్ణురెడ్డి

డాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ అధిష్టానం పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగా పక్షం రోజుల కిందట పార్టీ అనుబంధ సంఘాల్లో పలువురికి స్థానం కల్పించారు. పార్టీ విశాఖ జిల్లా బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియోజకవర్గానికి చెందిన ససపల రవీంద్రభరత్‌తోపాటు నియోజకవర్గంలోని వార్డుల నుంచి పలువురికి పార్టీ అనుబంధ సంఘాల్లో స్థానం కల్పించిన విషయం తెలిసిందే.

తాజాగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గానికి చెందిన పలువురికి విశాఖపట్నం జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో స్థానం కల్పించారు. 37వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్థాయి సంఘం మాజీ సభ్యుడు చెన్నా జానకీరామ్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ప్రధాన కార్యదర్శిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌ను నియమించారు. సెక్రటరీ ఆర్గనైజేషనల్‌గా మక్సూద్ అహ్మద్, అభిరెడ్డి ఆది విష్ణురెడ్డికి స్థానం కల్పించారు. సెక్రటరీ యాక్టివిటీగా పద్మనాభం అమ్మాజీ, గురజాపు రవి, అధికార ప్రతినిధిగా దొడ్డి రామానంద్‌ను నియమించారు.


దొడ్డి రామానంద్

వైఎస్సార్‌సీపీకి, వాసుపల్లికి కృతజ్ఞతలు

జగదాంబ : కష్టపడి పనిచేసిన వారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మరిచిపోదని పార్టీ జిల్లా సెక్రటరీగా నియమితులైన అబ్బిరెడ్డి ఆదివిష్ణురెడ్డి అన్నారు. ఈ మేరకు వార్డు నాయకుడు అలపన కనకరెడ్డితో కలిసి వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ని గురువారం కలిసి గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అనంతరం వాసుపల్లికి, కనకరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


వాసుపల్లి గణేష్‌కుమార్‌ని సత్కరిస్తున్న ఆదివిష్ణురెడ్డి, కనకరెడ్డి, తదితరులు

చిరు వ్యాపారులను తొలగించడం దుర్మార్గం

సీతమ్మధార : పూర్ణా మార్కెట్ రోడ్డు మార్జిన్‌లో జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అండగా నిలవాలని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం చిరు వ్యాపారులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పూర్ణా మార్కెట్ వద్ద రోడ్లపై గంపలు, తోపుడుబండ్లపై పండ్లు, పువ్వులు వగైరా వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులను పోలీసులు అక్కడి నుంచి పూర్తిగా తొలగించడం దుర్మార్గమన్నారు. పూర్ణా మార్కెట్ జీవీఎంసీ ఆధీనంలో ఉందని, అటువంటప్పుడు అక్కడి వ్యాపారులపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే కౌన్సిల్‌లో తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. అటువంటిది ఏమీ లేకుండా పోలీసులు జోక్యం దేనికని ఆయన ప్రశ్నించారు. చిరు వ్యాపారులను అక్కడి నుంచి తొలగించాలంటే, ప్రత్యామ్నాయ స్థలాన్ని వారికి కేటాయించాలని, వెండర్ జోన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చిరు వ్యాపారులను కొండలు, భూములు ఆక్రమణదారులుగా, దొంగలుగా భావించడం సరికాదన్నారు. పేదల పక్షాన ఉంటానని హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చినప్పటి నుంచి చిరు వ్యాపారులపై దాడులు పెరిగాయని సీపీఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు ఆరోపించారు. చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని నగర పోలీస్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రాలు సమర్పించామని, నేడు జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. అధిక సంఖ్యలో చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



జీవీఎంసీ ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు, నాయకులు

విపత్తుల నివారణపై పుస్తకావిష్కరణ

డాబాగార్డెన్స్ : విపత్తుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉభయ గోదావరి జిల్లాల్లో పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ‘పారా’ రూపొందించిన పుస్తకాన్ని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించేందుకు ఆపద మిత్ర కరదీపిక పుస్తకాన్ని పీపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్ అవేర్నెస్ (పారా) రూపొందించిందన్నారు. ఈ పుస్తకం అందరికీ అర్థమయ్యేలా రూపొందించారని, విపత్తులు సంభవించినప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కొంత వరకు ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించుకోవచ్చని చెప్పారు. ఇటువంటి పుస్తకాలు రూపొందిస్తున్న పారా సంస్థను మేయర్ అభినందించారు. బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, పారా సంస్థ ప్రతినిధి అడ్రూస్, స్వాతంత్ర్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎల్‌పీ కుమార్, డాక్టర్ శీతల్ పాల్గొన్నారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, తదితరులు

గ్లోబల్ వార్మింగ్‌తో ప్రమాదం

కంచరపాలెం : వాతావరణంలో వేడి పెరిగిపోవడం మానవాళికి ఓ హెచ్చరిక అని నన్నయ్య యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి డాక్టర్ సుందరి రామకృష్ణారావు అన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.మాణిక్యకుమారి, వ్యూస్ సంస్థ కో – ఆర్డినేటర్ రాజేశ్వరి నేతృత్వంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంస్థతో నిర్వహించిన యూత్ ఏక్షన్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భూమి మీద మాత్రమే జీవి మనుగడ సాగిస్తోందని వివరించారు.

శీతోష్ణస్థితి వేడెక్కకుండా యువత పూర్తి స్థాయిలో కృషి చేయాలని కోరారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఒ.భానుకుమార్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ వల్ల కలిగే ఉపద్రవాలపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విపత్తులు సంభవించక ముందే కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ ఎం.పద్మ, హాని, దివ్య, జేవీ రత్నం, డాక్టర్ హరిణి, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ స్నేహ, డాక్టర్ మౌసమి, శంకర్, డాక్టర్ శ్రీను, డాక్టర్ పద్మాసుందరి, ఊర్మిళ, రంజిత, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

కుటుంబాల చెంతకు బిహార్ వాసులు

సీతమ్మధార : ఇద్దరు బిహార్ యువకులను ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో శ్రద్ధా ఫౌండేషన్ వారి ఇళ్లకు చేర్చింది. ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి ప్రగాడ వాసు మాట్లాడుతూ బిహార్‌లోని పర్సానీ గ్రామానికి చెందిన బికాస్ కుమార్ (20) తల్లి చనిపోవడంతో చలించిపోయి ఇల్లు వదిలి వచ్చేశాడు. రెండో వ్యక్తి బిహర్‌లోని బోధ్ గయకు చెందిన రాందరీ మంజీ (38) అలియాస్ సుందర్ 8 సంవత్సరాల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికం వల్ల మందులు వేసుకోకపోవడంతో వ్యాధి ముదిరి రోడ్డు పాలయ్యాడు.

ఏయూటీడీ వీరికి వైజాగ్‌లో ఆశ్రయం కల్పించి వైద్యం అందించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. శ్రద్ధా ఫౌండేషన్ సంస్థ వీరికి ప్రతీ నెలా ఉచితంగా మందులు పంపిస్తున్నట్లు వాసు తెలిపారు.


కుటుంబ సభ్యులకు అప్పగించిన వారితో శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడుదాం

వైఎస్సార్ సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


వాసుపల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు


వాసుపల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నా జానకీరామ్, తదితరులు

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ అభివృద్ధిని, ప్రజలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి పాలన కుంటిపడిందన్నారు. ఆశీల్‌మెట్ట కార్యాలయంలో గురువారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వాసుపల్లిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీలో స్థానం కల్పించడంతో వారంతా వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు బయటికి రాకుండా చంద్రబాబు, లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. ప్రజల కష్టాలు, మత్స్యకారుల బాధలు, కార్మిక, రైతు, కర్షక, యువత, మహిళల సమస్యలు పట్టించుకోని కూటమి పాలన రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే రాష్ట్ర ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని, ప్రజలకు అండగా నిలుస్తూ ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, కోడిగుడ్ల శ్రీధర్, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా సెక్రటరీలు అభిరెడ్డి ఆదివిష్ణురెడ్డి, గురజాపు రవి, పలు వార్డుల నాయకులు పీతల వాసు, అలపున కనకారెడ్డి, బాపూ ఆనంద్, యువజన విభాగం అధ్యక్షుడు తాడి రవితేజ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాసర్ల సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, లండా రమణ, బెవర మహేష్, ఆరుగుల రాజు, నౌషద్, వేళంగిని శేషగిరిరావు, గనగళ్ల రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

సిటీ పోలీస్ జట్టు విజయం

విశాఖ స్పోర్ట్స్: వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ లీగ్‌లో భాగంగా జింక్‌గ్రౌండ్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్ జట్టుపై సిటీపోలీస్ జట్టు ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన ఇన్‌కమ్‌ట్యాక్స్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది.రాజేంద్ర 23 పరుగులు చేశాడు. కేశవ మూడు, శ్రీను,అప్పన్న చెరో రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా సిటీపోలీస్ నాలుగు వికెట్లు కోల్పోయి 12.3 ఓవర్లలోనే విజయలక్ష్యానికి చేరింది. సంతోష్ 26 పరుగులు చేయగా త్రినాథ్ 50 పరుగులతో నిలిచాడు.

పారిశుధ్య కార్మికునిపై దాడి


స్థానికులను విచారిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

అల్లిపురం : జీవీఎంసీ జోన్ – 4 పరిధి నేతాజీనగర్‌లో పారిశుధ్య కార్మికునిపై స్థానికంగా నివసిస్తున్న వ్యక్తి దాడి చేయడంపై పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. బుధవారం ఇంటి ముందు చెత్త తీయమని దురుసుగా మాట్లాడటంతో వారి మధ్య మాటమాట పెరిగి దాడికి దారితీసింది. దీంతో విషయం తెలుసుకున్న సహ కార్మికులు ఆందోళన చేయడంతో గురువారం జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు నేతాజీనగర్‌లో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. పారిశుధ్య కార్మికులపై దాడులు చేపడితే ఆ ప్రాంతంలో పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఆయనవెంట వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఉన్నారు.

వివేకానంద సంస్థలో ఉచిత వైద్య శిబిరం

డాబాగార్డెన్స్ : స్నేహ సంధ్యా ఏజ్ కేర్ ఫౌండేషన్ సహకారంతో పాత నగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సూర్యతేజ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో ప్రసాద్‌నాయుడు, కమల ప్రియ, సుమతి, సాయిచంద్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బొత్సతో వాసుపల్లి భేటీ


బొత్స సత్యనారాయణతో వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు బొత్స సత్యనారాయణతో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు పలు రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు, నాయకుల్లో నూతన ఉత్సాహం నింపుతామన్నారు. ఈ మేరకు జిల్లాలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు అనుబంధ సంఘాల పదవులు ఇచ్చామన్నారు. త్వరలో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాబోతున్నారని, 2027 జమిలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలంతా పట్టం కడతారన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని కూటమి ప్రభుత్వం వెనక్కి నెట్టిందన్నారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ రాజ్యాన్ని ప్రజలు కోరుకుంటున్నారని వాసుపల్లి తెలిపారు.

ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల గుర్తింపు

మహారాణిపేట : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పెయిందొర పేటలో గురువారం ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులను గుర్తించారు. పెయిందొర పేట, కేజీహెచ్, జాలారిపేట తదితర ప్రాంతాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ సర్వే ఈ నెల 24 వరకు సాగుతుందన్నారు. ఎక్కడైనా దివ్యాంగ పిల్లలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారమివ్వాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో మెలగాలి

సీతమ్మధార : ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని సంఘమిత్ర సోషల్ సర్వీస్ వ్యవస్థాపకుడు సంఘమిత్ర సూరిబాబు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ఆయన ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు గల కారణాలపై అవగాహన ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒక చిన్న తప్పు చేయడం వల్ల మంచి వారందరూ బాధ్యతగా పనిచేసినా ప్రయోజనం ఉండడం లేదన్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు పని చేయకుండా, అప్పుడప్పుడు వచ్చి పూర్తి జీతం తీసుకోవడం వల్ల ఆయా వ్యవస్థలు పూర్తిగా విచ్ఛిన్నం అవుతున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రమాదేవి, ప్రజా గాయకులు దేవిశ్రీ,, సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సంఘమిత్ర సూరిబాబు

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

డాబాగార్డెన్స్ : విద్యకు, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యార్థినుల వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యే విధంగా సిద్ధం చేయాలని సూచించారు. వసతి గృహంలో ఉండే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. అనంతరం కృష్ణా కళాశాలను సందర్శించి అక్కడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణానగర్ ఏరియాలో గల మలేరియా నియంత్రణ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులు గమనించారు. పర్యటనలో కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, ఇతర అధికారులు ఉన్నారు.


ప్రిన్సిపాల్ మంజులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

8న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట : మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు ఎక్కువ కేసులు వచ్చేలా వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సూచించారు. గురువారం జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రజా న్యాయపీఠం అధ్యక్షుడు వల్లభ నాయుడు పాల్గొన్నారు.

40 మందికి కళ్లద్దాలు అందజేత


కళ్లద్దాలు అందుకున్న వారితో ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ జయంతిని పురస్కరించుకుని తనయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్ గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. వివేకానంద సంస్థ ఇటీవల నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 40 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవత్సవ్ మాట్లాడుతూ వివేకానంద సంస్థ ఈ ఏడాదిలో 6 సార్లు శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి పేదలను ఆదుకుందన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ఉమాదేవి, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.